
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 6 జూలై 2025



## ఉగ్రవాదుల కేసులో రహస్యంగా విచారణ

రాయచోటి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో దొరికిన ఉగ్రవాదులతో సన్నిహితంగా మెలిగిన, వారికి సహకరించిన వారిని పోలీసులు మూడు రోజులుగా రహస్యంగా విచారిస్తున్నారు. ఈ విచారణ మొత్తం కేంద్ర స్థాయిలోని అత్యున్నత దర్యాప్తు సంస్థలు, నిఘా వర్గాల కనుసన్నల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయిలోని దర్యాప్తు, నిఘా వర్గాలు సైతం పాల్గొంటున్నట్లు సమాచారం. అత్యంత చాకచక్యంగా ఉగ్రవాదులను తమిళనాడు ఐబీ, అన్నమయ్య పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ANNAMACHARYA
INSTITUTE OF TECHNOLOGY AND SCIENCES - KADAPA
(Autonomous)
(Approved by AICTE, & Affiliated to JNTUA, Anantapur)
Accredited by NBA (B.Tech - EEE, ECE & CSE) & NAAC 'A' Grade
Utukur (P), C.K. Dinne (V&M), Kadapa Dist., A.P.-516003, web : www.aitskadapa.ac.in
COUNSELING CODE : AITK
COURSES OFFERED
B.Tech.
- Civil Engineering
- Electrical and Electronics Engg.
- Mechanical Engineering
- Electronics & Communication Engg.
- Computer Science & Engineering
- Artificial Intelligence & Data Science
- CSE (Artificial Intelligence & Machine Learning)
Diploma
- Electrical & Electronics Engg.
- Electronics and Communication Engg.
- Computer Engineering
- M.Tech. - MCA - MBA
For Admissions Contact : 96039 99591, 73863 24079
You can avail free help desk at our campus for web options

# వైసీపీకి దాసోహం

**● గత తహశీల్దార్ మహేశ్వర్‌రెడ్డి.. రికార్డుల ట్యాంపరింగ్‌లో దిట్ట**

- సొంత ఆస్తి రాసిచ్చినట్లుగా ప్రభుత్వ, ప్రైవేటు భూముల సంతర్పణ
- ఎర్రగుంట్లలో 142 ఎకరాల ప్రభుత్వ భూమి
- కడప రింగు రోడ్డులో రూ.500 కోట్ల భూములు ఆన్‌లైన్‌లోకి..
- కోర్టు ఆదేశాలతో వివరణ కోరిన ప్రభుత్వం

వైసీపీ హయాంలో సీకేదిన్నె తహశీల్దారుగా పనిచేసిన మహేశ్వర్‌రెడ్డి లీలలు అన్నీ ఇన్నీ కాదు. ఆయన పనిచేసిన చోటల్లా అక్రమార్గాల్లో కోట్లాది రూపాయల ప్రభుత్వ, ప్రైవేటు భూములను వైసీపీ నేతల చేతుల్లో పెట్టారన్న విమర్శ ఉంది. కడపలో విలువైన భూములన్నీ సీకేదిన్నె రెవెన్యూ పరిధిలోనే ఉన్నాయి. ఇటు ఎర్రముక్కపల్లె ప్రొఫెసర్స్ కాలనీ నుంచి రిమ్స్, రింగురోడ్డు, మామిళ్లపల్లె, ఊటుకూరు రెవెన్యూ పొలాల్లో ఒకఎకరం ఎంత హీనంగా వేసుకున్నా రూ.3కోట్లు పైమాటే. అలాంటి విలువైన ప్రభుత్వ భూములన్నీ ఆయన హయాంలోనే మాయం కావడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలోనే కేవలం రింగురోడ్డు పరిధిలోనే సుమారు రూ.500 కోట్ల మేర భూములు అన్యాక్రాంతం అయ్యాయనే చర్చ నడుస్తోంది.



మహేశ్వర్‌రెడ్డి సీకేదిన్నె తహశీల్దారుగా ఉన్న సమయంలో వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిన ప్రైవేటు భూమి



(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సీకే దిన్నె రెవెన్యూలో భూమాఫియా రాజ్యమేలింది. అప్పట్లో పోలీసు శాఖను శాసించిన ఓ సీఐ సహకారంతో రింగురోడ్డు చుట్టూ ఉన్న విలువైన భూములను కాజేశారు. కార్పొరేషన్‌లో ప్రజాప్రతినిధిగా ఉన్న ఒకత ను, ఆ సీఐ, మరో అధికారి కలిసి సీకే దిన్నె రెవెన్యూ పరిధిలో ఉన్న భూముల్లో చాలా వరకు కొట్టేశారని చెబుతారు. పేదలను బెది రించి సెటిల్‌మెంటు చేసుకుని భూములను రాయించుకున్నారని చెబుతారు. బలమైన సామాజికవర్గం న్యాయస్థానానికి వెళ్లి ఫైట్ చేయడంతోనే ఈ అక్రమాలు బయటికి వచ్చాయి.

సీకేదిన్నె మామిళ్లపల్లె రెవెన్యూపొలం సర్వే నెం.455/5లో 4.89 ఎకరాలు, 455/6లో 1.13 ఎకరాల భూమిని 1978లో గువ్వల రాయప్ప, జి.గోవిందుల పేరిట డీకేటీ పట్టా లు ఇచ్చారు. అవి కాలక్రమేణా కంబయ్యగారి భాస్కర్‌రెడ్డి పేరుతో మ్యుటేషన్ జరిగాయి. 2020 వరకు అలాగే ఉండేది. అయితే ఈ రెండు సర్వే నెంబర్లలోని 6.02 ఎకరాల భూమిని ఎలాంటి రికార్డులు లేకుండానే అందూరి మాధవి వైఫ్ ఆఫ్ రాంప్రసాద్‌రెడ్డి పేరిట ఖాతా నెం.1313తో మ్యుటేషన్ జరిగింది. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించ డంతో బాధితులకే అనుకూలంగా తీర్పు వచ్చింది. ట్యాంపరింగ్‌పై మహేశ్వర్‌రెడ్డి వివరణ ఇవ్వాలని ప్రభుత్వం సంజాయిషీ కోరింది. అప్పట్లో రాంప్రసాద్‌రెడ్డి అండ్ కో వైసీపీలో ఉండేవారు. ఇప్పుడు టీడీపీలో ఉన్నారు.

### మహేశ్వర్‌రెడ్డి లీలలు ఎన్నో..

● మామిళ్లపల్లె రెవెన్యూ పొలం 523/లోని ఓ సర్వేనెంబరులో 2.89 ఎకరాల భూమిని పెండ్లిమర్రి మండలానికి చెందిన రామ్మో హన్‌రెడ్డి కొనుగోలు చేశారు. ఈ భూమిని కూడా ట్యాంపరింగ్ చేసి ఓ వైసీపీ నేత కుటుంబీకులకు కట్టబెట్టారు.

● కడప - చిత్తూరు జాతీయ రహదారిలో ఊటుకూరు రెవెన్యూపొలం 692 /1ఏ, 1బీ, 692/2, 718/1, 2, 719/1, 2, 3, 720/1, 2లతో పాటు మరికొన్ని సర్వేనెంబర్లలో భావనా టౌన్‌షిప్ లేఅవుట్ వేశారు. ప్రభుత్వ భూములతో పాటు ఇతర లిటిగేషన్ భూము ల్లో లేఅవుట్ వేశారని అంటున్నారు. ఈ భూముల విలువ సుమారు రూ.300 కోట్లు. దీనిపై గతంలో ఆంధ్రజ్యోతి ప్రధాన సంచిక లో వరుస కథనాలు వచ్చాయి. అయినా అప్పట్లో వైసీపీ వారికి అడ్డగోలుగా నో అబ్జక్షన్ సర్టిఫికెట్లు ఇచ్చారు. అక్కడ అక్రమా లు జరిగినట్లు చంద్రబాబు ప్రభుత్వం గుర్తించింది. సీకేదిన్నె పోలీసుస్టేషను ప్రాంతంలో ఉన్న వాగులు, వంకలను సైతం ఆక్రమించేసి లేఅవుట్లు వేసి వాటిని అడ్డ గోలుగా ఆన్‌లైన్ ఎక్కించారు. ఒక్క సీకే దిన్నె మండలంలోనే మహేశ్వర్‌రెడ్డి అన్యాక్రాంతం చేసిన భూముల విలువ రూ.500 కోట్లు ఉంటుందని అంచనా.

● మహేశ్వర్‌రెడ్డి ఎర్రగుంట్ల తహశీల్దారుగా పనిచేసినప్పుడు వై.కోడూరులో సర్వే నెం.756లో ఉన్న 142 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలకు డైరెక్టుగా ఆన్‌లైన్ చేశారు. ఈ భూ కుంభకోణంపై అప్పటి కడప ఆర్డీవోగా ఉన్న సబ్ కలెక్టర్ పృథ్వీతేజ్ విచారణకు ఆదేశించగా అసైన్‌మెంటు కమిటీ, ఇతర ఆధారాలు లేకుండా డైరెక్టుగా ఆన్‌లైన్‌లో ఎక్కించారని తేలింది. అవన్నీ బోగస్ అని తేల్చి ఆన్‌లైన్ రద్దు చేసి తహశీల్దారుపై కఠిన చర్యలు తీసుకోవాలని అప్పటి కలెక్టరుకు సిఫారసు చేశారు. అయితే అప్పటి వైసీపీలో నేతలు పట్టుబట్టి ఆ ఫైలు పక్కన పడేయడం గమనార్హం.

వైసీపీ హయాంలో ముఖ్యంగా మహేశ్వర్‌రెడ్డి సీకేదిన్నె తహశీల్దారుగా పనిచేసే సమయంలో జరిగిన భూము ల ఆన్‌లైన్ నమోదులపై కలెక్టర్ చొరవ తీసుకుని ప్రత్యేకబృందంతో విచారణ చేయిస్తే భారీ భారీ కుంభకోణం వెలుగులోకి వస్తుం దని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## మీరు ఉక్కు మనిషి..

**● ఎమ్మెల్యే వరదతో సీఎం చంద్రబాబు**

ప్రొద్దుటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగిన విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఫోన్‌లో ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. "మీరు ఉక్కు మనిషి. మీకు ఏమీ కాదు. త్వరగా కోలుకుని రండి. మనం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి" అని చంద్రబాబు అన్నారని వరదరాజులరెడ్డి కొడుకు కొండారెడ్డి తెలిపారు. సోమవారం తన తండ్రి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అవుతారని ఆయన పేర్కొన్నారు.

## లోక్ అదాలత్‌లో.. 1800 కేసులకు అవార్డులు

**● జిల్లా ప్రధాన జడ్జి యామిని**



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో శనివారం నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించామని, ఇందులో 1,800 కేసులను పరిష్కరించి రూ.14,03,00,338 చెల్లించామని డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో నేషనల్ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌కు వచ్చిన కేసుల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా 24 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తద్వారా లోక్‌అదాలత్‌లను దేశమంతటా నిర్వహిస్తూ వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇక్కడ ఒకసారి కేసు పరిష్కారం అయితే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అపీల్‌కు వెళ్లడానికి వీలు పడదన్నారు. లోక్‌అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. లోక్ అదాలత్ నిర్వహణలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, ఆయా కోర్టుల జడ్జిలు, న్యాయవాదులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా ధ్వజారోహణం

**● యాలివాహనంపై సౌమ్యనాథుడు**

నందలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సునీల్‌కుమార్, పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సాయిస్వామి ఆధ్వర్యంలో గరుడ పతాకాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి యాలి వాహనంపై మహా తేజోవంతుడు సౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి విశేషాలంకరణలో పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీపకుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



యాలివాహనంపై సౌమ్యనాథస్వామి



వైభవంగా ధ్వజారోహణం నిర్వహిస్తున్న పండితులు

**బ్రహ్మోత్సవాల్లో నేడు :** ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పల్లకీసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి హంసవాహనంపై సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

## ఆక్రమిత స్థలంలో బోర్డుపాతిన అధికారులు



బోర్డు పాతుతున్న రెవెన్యూ సిబ్బంది

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మండలం తురకపల్లె గ్రామం వద్ద ఆక్రమణకు గురవుతున్న గుట్ట స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 'వైసీపీ నేత భూదాహం' అనే శీర్షికన ఈ నెల 2న వెలువడిన వార్తకు స్పందించిన రెవెన్యూ అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. సర్వే నెం.75లో 416.50 ఎకరాలు, సర్వే నెం.120లో 38.30 ఎకరాల స్థలం ప్రభుత్వ భూమి అని శనివారం బోర్డు పెట్టి ఎవరైనా ఈ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నజీర్, వీఆర్వోలు రమణ, చంద్రయ్య, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగు పరచాలి

**● ఎంపీడీవోల శిక్షణలో డీపీవో**




మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

కడప రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు పరిచి తద్వారా పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని పంచాయతీ శాఖ జిల్లా అధికారి రాజ్యలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం పేర్కొన్నారు. జిల్లాలోని ఎంపీడీవోలకు, డిజిటల్ అసిస్టెంట్లకు, పంచాయతీ సెక్రటరీలకు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ)లో శనివారం శిక్షణ నిర్వహిరచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెసీమల ప్రగతిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని ఇందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. పన్ను వసూళ్లపై సమీక్ష, సమావేశాలు నిర్వహించాలన్నారు. పారిశుధ్యం, ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల పనితీరు మెరుగుపడాలన్నారు. ప్రాథమిక సేవలను ప్రజలకు అందించడానికి ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి పురోగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ఏవో బండపల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి-హిసర్ మధ్య ప్రత్యేక వీక్లీ రైలు



కడప ఎర్రముక్కపల్లె, జూలై 5 (ఆంధ్ర జ్యోతి): తిరుపతి -హిసర్-తిరుపతిలకు కడప మీదుగా ప్రత్యేక వీక్లీ రైలును (07717/07718)ను నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. ఈనెల 9 నుంచి సెప్టెంబరు 24 వతేదీ వరకు తిరుపతిలో ప్రతి బుధవారం రాత్రి 11.45 గంటలకు రైలు బయలుదేరుతుందన్నారు. అర్ధరాత్రి 12.18గంటలకు రేణిగుంట, గురువారం తెల్లవారుజాము 1.20గంటలకు రాజంపేట చేరుకుంటుందని చెప్పారు. కడపకు 2.28గంటలకు, ఎర్రగుంట్ల 3.15, తాడిపత్రి 4.15కు చేరుకుంటుందన్నారు. సూరత్ మీదుగా అజ్మీర్‌కి శనివారం ఉదయం 4.50గంటలకు వెళుతుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం 2.05గంటలకు హిసర్ చేరుకుంటుందని చెప్పారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో ఈనెల 13వ తేదీ నుంచి సెప్టెంబరు 28వ తేదీ వరకు హిసర్‌లో ప్రతి ఆదివారం రాత్రి 11.15గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 8.15కి అజ్మీర్ చేరుకుంటుంది. సూరత్, కర్నూలు మీదుగా ఎర్రగుంట్లకు బుధవారం ఉదయం 8.20గంటలకు, కడపకు 9.05కు, రాజంపేట 9.50గంటలకు, మధ్యాహ్నం 11.30గంటలకు తిరుపతి చేరుకోనుందన్నారు. ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఈ ప్రత్యేక వీక్లీ రైలును వేసినట్లు తెలిపారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాట

- 10న జిల్లా వ్యాప్తంగా పేరెంట్స్-టీచర్స్ మీట్
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్‌శ్రీధర్ చెరుకూరి, చిత్రంలో జేసీ అదితి సింగ్

కడప కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బిడ్డల బంగారు భవిష్యత్తుకు బాటలలు వేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10వ తేదీన జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు నిర్వహించనుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఈ కార్యక్రమంపై శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలసి కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెగా టీచర్స్-పేరెంట్స్ మీట్ అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, జూనియర్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు 10 వ తేదీన ఏకకాలంలో మెగా పేరెంట్స్-టీచర్ మీట్ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల మానసిక స్థితి, సామాజిక స్థితి, ప్రవర్తన, అభ్యసన సామర్థ్యం గురించి సంబంధిత క్లాస్ టీచర్ లేదా హెడ్‌మాస్టారుతో పేరెంట్స్ చర్చిస్తారన్నారు. విద్యార్థులు, పాఠశాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలంటే పేరెంట్స్ కమిటీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలన్నారు. మిడ్‌డే మీల్స్‌లో విప్లవాత్మక మార్పులు జరిగాయని రాష్ట్రంలో మొదటిసారి స్మార్ట్ కిచెన్‌ను జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నెలో ఏర్పాటు చేస్తామన్నారు. నాల్గవ తరగతి పైబడిన విద్యార్థులంతా తమ తల్లిదండ్రులకు నమస్కరించి అమ్మ పేరు మీద మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు. అనంతరం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్లో మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ నిర్వహణపై ఎంఈవోలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో వర్చువల్ విధానంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

## సాగేనా..?



- ఖరీఫ్ ప్రారంభమై 30 రోజులు
- కరుణించని వరుణుడు
- సాగు లక్ష్యం 77,475 హెక్టార్లు
- ఇప్పటి వరకు 2,565 హెక్టార్లకే పరిమితం




కడప రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సాగుకు అన్నదాత ఆకాశం వైపు ఎదురుచూస్తున్నాడు. జూన్ మొదటి వారంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల దాటుతున్నా సరైన వర్షాలు లేక ఇప్పటి వరకు కేవలం 3.31 శాతమే పంటలు సాగయ్యాయి. వరుణ దేవుడు ముఖం చాటేయడంతో 77,475 హెక్టార్ల సాగుకు గాను గురువారం నాటికి కేవలం 2,565 హెక్టార్లు మాత్రమే సాగైంది. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతుండడంతో ఆశలు వదులుకునే పరిస్థితి నెలకొంది. సాధారణంగా జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ పనులు ప్రారంభం అవుతాయి. జూలై 15 వరకు పంటలు విత్తుకునే గడువున్నా జూన్ నెలలో సాగైన పంటలే ఆశించిన దిగుబడులు వస్తాయి. దీనిని బట్టి చూస్తే పంటల సాగుకు జూన్ నెలే కీలకం. మరో రెండు వారాలలోపు సాగుకు అనువైన వర్షాలు పడితేనే. ఇలాగే వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాల్సి వస్తుంది.

### వెంటాడుతున్న వర్షాభావం

అన్నదాతలను వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు అయినా ఇప్పటి వరకు ఏ దశలోను సాగుకు అవసరమైన వర్షాలు పడలేదు. ప్రతిరోజు ఆకాశం మేఘావృతమై వర్షాలు పడేలా కారుమబ్బులు కమ్ముకొంటున్నా.. వరుణ దేవుడు కరుణించకపోవడంతో అవి చుట్టం చూపులాగా ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నాయి. ప్రాజెక్టులలో అరకొర ఉన్న నీరూ ఇంకిపోతోంది. నైరుతి రుతుపవనాల ద్వారా జూన్‌లో 68.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 21.6 మాత్రమే నమోదైంది. అలాగే జూలై నెలలో 96.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు వర్షమే కురవలేదు.

### అడుగంటుతున్న ఆశలు

ఈ సారి వర్షాలు సకాలంలోనే పలకరిస్తాయని వాతావరణశాఖ నిపుణులు పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు వస్తాయనే నమ్మకంతో పొలాలను దుక్కులు దున్ని పంటలసాగుకు అవసరమైన వాటిని సమకూర్చుకుని ఎదురుచూస్తున్న కర్షకులకు.. ఈ యేడు కూడా ఖరీఫ్ కష్టాలు తప్పేలా లేవు. జిల్లాలో పంటలు అత్యధిక భాగం వర్షంపై ఆధారపడి సాగవుతున్నాయి. ఇందులో ఖరీఫ్ సీజన్‌ను ప్రథమ ప్రాధాన్యతగా చెప్పుకోవచ్చు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 77,475 హెక్టార్లు సాగు లక్ష్యంగా అధికారులు నిర్ధారించారు. అయితే ఇప్పటి వరకు వరి, పత్తి, వేరుశనగ, ఇతర ఆహార ధాన్యాలు కలిపి కేవలం 2,565 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. దీంతో ఖరీఫ్‌లో పంటల సాగుపై రైతుల్లో ఆశలు అడుగంటుతున్నాయి.

# మంత్రి వచ్చారు.. వెళ్లారు!




- జూనియర్ కళాశాలలో పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- వేధిస్తున్న పాముల బెడద
- అసాంఘిక చర్యలకు నిలయాలుగా భవనాలు
- ప్రతి ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

**మంత్రి వచ్చి వెళ్లారు. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలు ఇకపై పరిష్కారం అవుతాయని భావించిన విద్యార్థులకు నిరాశే మిగులుతోంది. మంత్రి వచ్చి వెళ్లి ఐదు నెలలు గడుస్తున్నా ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.**

ములకలచెరువు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులోని జడ్పీ హైస్కూల్ భవనాల్లో 1994లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం కాగా, 1997-98 విద్యా సంవత్సరంలో ప్రభుత్వా స్పత్రి సమీపంలో నిర్మించిన భవనంలోకి తరగతి గదులను మార్చారు. అప్పట్లో నాలుగు తరగతి గదులే నిర్మించగా, 2009లో పనికి ఆహార పథకం కింద ఆఫీసు గదిని నిర్మించారు. ఆ తర్వాత కళాశాల అబివృద్ధిని గాలికి వదిలేశారు. కళాశాల ఉన్నది గుట్ట ప్రాంతం కావడంతో పాటు వెనుక భాగంలో ప్రహరీగోడ లేకపోవడంతో పా ముల బెడదతో విద్యార్థులు హడలెత్తిపోతున్నారు. తరగతి గదుల్లోకి పాములు వచ్చిన సంఘటనలు లేక పోలేదు. కళాశాల ప్రారంభ సమయంలో 27 ఏళ్లకు ముందు నిర్మించిన నాలుగు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. తరువాత తరగతి గదులు నిర్మించలేదు. బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమెస్ట్రీ ల్యాబ్‌లు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. పాఠశాలలో ఇప్పటి వరకు కనీసం బోరు కూడా వేయకపోవడంతో గ్రామ పంచాయతీ కొళాయిల్లో వచ్చే నీరే దిక్కయింది. గత వైసీపీ హయాంలో నాడు - నేడు కింద ప్రారంభిం చిన మరుగుదొడ్ల పనులు అర్ధాంతరంగా ఆగిపోయా యి. ఈ కారణాలతో జూనియర్ కళాశాలలో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.



కూలిపోయిన ప్రహరీ గోడ



కళాశాల వెనుక వైపు పెరిగిన పిచ్చి మొక్కలు

### మందుబాబులకు అడ్డా..

ప్రభుత్వ జూనియర్ కళాశాల మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రహరీ గోడ లేకపోవడం, దగ్గరలోనే మద్యం దుకాణం ఉండడంతో రాత్రి వేళల్లో మందుబాబులు కళాశాల భవనాలను వినియోగించుకుంటున్నారు. దీంతో ప్రతిరోజు ఉదయం కళాశాల ప్రాంగణంలో మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు దర్శనమిస్తాయి. దీనికితోడు మద్యం సీసాలు పగులగొట్టి వెళుతుండడంతో గాజు పెంకులు గుచ్చుకుని విద్యార్థులు గాయపడుతున్నారు.

### మంత్రి వచ్చినా.. పరిష్కారం కాలేదు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డితో కలిసి ఈ ఏడాది జనవరి 4న కళాశాలను సందర్శించారు. అప్పట్లో అధ్యాపకులు, విద్యార్థులు కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఆయన హామీ ఇచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా మంత్రి చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

**ఐదేళ్లుగా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య**

| విద్యా సంవత్సరం | ఫస్ట్ ఇయర్ | సెకండ్ ఇయర్ | మొత్తం |
|---|---|---|---|
| 2021-22 | 155 | 166 | 321 |
| 2022-23 | 79 | 160 | 239 |
| 2023-24 | 54 | 94 | 148 |
| 2024-25 | 109 | 70 | 189 |
| 2025-26 | 70 | 102 | 172 |

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**



జూనియర్ కళాశాలలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కరిస్తా మని చెప్పారు. ప్రహరీ గోడ లేకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నాం. అదనపు తరగతి గదులు, ల్యాబ్‌ల ఏర్పాటుకు గదులు కావాలి. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరాం.

- నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్

**సమస్యలతో సతమతం**



కళాశాలలో సమస్యలతో సత మతమవుతున్నాం. కనీసం తాగ డానికి మంచి నీరు కూడా లేవు. వాటర్ క్యాన్లను కొనుక్కుని తాగుతున్నాం. ప్రహరీ గోడ లేక పోవడంతో రక్షణ కరువైంది. పాములు తరగతి గదుల్లోకి వస్తున్నాయి. కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి.

-మానస, విద్యార్థిని

## సచివాలయ ఉద్యోగుల బదిలీలు షురూ

- సోమవారం నుంచి ఉత్తర్వుల జారీ

కలికిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు, పోస్టింగులకు సంబంధించిన గడువు శనివారంతో ముగిసింది. సచివాలయాల్లో వివిధ కేటగిరీల్లోని పోస్టులను హేతుబద్ధంగా సర్దుబాటు చేస్తూ, జూన్ 30 లోగా పూర్తి చేయాలని జూన్ 12న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ ముగిసి, బదిలీలకు అర్హతగలిగిన వారందరికీ గత వారం కౌన్సెలింగ్ కూడా పూర్తి చేసింది. కొన్ని జిల్లాల్లో కౌన్సెలింగ్ ముగిసిన అనంతరం బదిలీ ఉత్తర్వులు మాత్రం జారీ చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. జూలై 1 నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉండడంతో సచివాలయాల శాఖ డైరెక్టరు జూన్ 26న జిల్లా కలెక్టర్లకు ఒక సర్క్యులర్ జారీ చేశారు. కౌన్సెలింగ్ మాత్రం గడువులోగా పూర్తి చేసి బదిలీలు, పోస్టింగ్ ఉత్తర్వులను జారీ చేయకుండా సూచనలిచ్చారు. ఈ కారణంగా కౌన్సెలింగ్ పూర్తయినా సచివాలయ ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేయలేదు. బదిలీ ఉత్తర్వులు జారీ చేసే గడువును ఈ నెల 5 వరకూ పొడిగించాలని సచివాలయ శాఖ డైరెక్టరు ప్రభుత్వాన్ని కోరారు. పరిశీలించిన ప్రభుత్వం శనివారం వరకూ బదిలీ ఉత్తర్వులు జారీ చేయవచ్చంటూ గ్రామ వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

## పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రామాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకానికి రైతులు ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం తెలిపారు. శనివారం మండలంలో బండపల్లి గ్రామంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. రైతులు తమ పొలాల వద్ద ఫారంపాండ్ ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఏపీవో పెంచలయ్య, ఈసీ ఓబులేసు, టీఏ కళావతి, ఫీల్డ్ అసిస్టెంట్లు సురేంద్ర పాల్గొన్నారు.

## కోదండరామాలయానికి ఎన్నారై విరాళం



విరాళంఅందజేస్తున్న శశిభూషణ్‌రాజు

సంబేపల్లె, జూలై5(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె గ్రామం అంబేద్కర్‌నగర్‌లో నిర్మిస్తున్న కోదండ రామాలయానికి ఎన్నారై శశిభూషణ్ రాజు శనివారం రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శశిభూషణ్‌రాజు దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్నారై మాట్లాడుతూ ఆలయ నిర్మాణాలతో ప్రజల్లో భక్తిభావం పెంపొందుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆలయాల నిర్మాణాలను ప్రభుత్వం చొరవతో పాటు దాతల సహకారంతో ఆలయాలు నిర్మించడం గొప్ప విశేషమన్నారు. మాజీ సర్పంచ్ గోపాల్, సుబ్బరాజు, రెడ్డెన్న, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం నరసింహస్వామి కల్యాణం



నరసింహస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని వేదపండితులు శనివారం శ్రీదేవి, భూదేవిలతో కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో ప్రతి నెలా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా చేశారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, గోకుల్, వెంకీ, వరద, ఆలయ సిబ్బంది నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అండ

- తప్పుడు ప్రచారంతో వైసీపీ పైశాచిక ఆనందం
- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మామిడి రైతులు నష్టపోకుండా ఫ్యాక్టరీలు కిలో రూ.8తో కొంటుండగా ప్రభుత్వం అదనంగా కిలోకు రూ.4లు ఇస్తోందన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మామిడి దిగుబడి భారీగా పెరిగిందన్నారు. దీంతో ప్రభుత్వం ముందుగా అప్రమత్తమై రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో సబ్సిడీ ఇస్తోందన్నారు. ప్రభుత్వం కిలో రూ.8తో కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసినా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ఫుడ్స్ రైతుల నుంచి కిలో రూ.3కే కొనుగోలు చేస్తోందన్నారు. నష్టాల్లో ఉన్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంటే తప్పుడు ప్రచారం చేస్తూ వైసీపీ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. కష్ట సమయాల్లో కిలో రూ.4 సబ్సిడీ ఇచ్చి ఆదుకుంటున్న ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసేందుకే జగన్‌రెడ్డి రైతులపై దండయాత్రకు బయలుదేరాడన్నారు.

## జాతీయ లోక్‌అదాలత్‌లో భారీగా కేసుల పరిష్కారం




రాయచోటి కోర్టులో కేసులను విచారిస్తున్న జిల్లా 5వ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి



రాజంపేటలో బాధిత కక్షిదారుకు పరిహారం అందజేస్తున్న న్యాయాధికారులు

రాయచోటిటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాయచోటి, రాజంపేట కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో భారీగా కేసులు పరిష్కారమయ్యాయి. రాయచోటి కోర్టులో జిల్లా 5వ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తేజస్విని 906 కేసులను పరిష్కరించారు. రోడ్డు ప్రమాదాల కేసుల్లో రూ.1,93,77,873ల నష్ట పరిహారం బాధితులకు చెల్లించారు. న్యాయవాదులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట కోర్టులో 204 క్రిమినల్ కేసులు, ఆరు సివిల్ కేసులు పరిష్కారం కాగా, కక్షిదారుల నుంచి 62,24,466 రూపాయలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా అదనపు జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దంపతులకు సంబంధించిన ఓ కేసులో 20 లక్షల రూపాయలతో రాజీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి టి.కేశవ, జూనియర్ సివిల్‌జడ్జి సి.రాజన్‌ఉదయప్రకాష్, పీపీటీ రామకృష్ణ, ఏజీపీ మౌనిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, జి.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ కమిటీ ఎన్నికల్లో వాగ్వాదం

- దూషించుకున్న తెలుగు తమ్ముళ్లు



శ్రీనివాసులునాయుడుతో వాగ్వాదం చేస్తున్న గొల్లపల్లి టీడీపీ నేతలు

రామసముద్రం జూలై 5(ఆంధ్రజ్యోతి):ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ కొందరు టీడీపీ నాయకులు ఎన్నికల పరిశీలకులతో వాగ్వాదానికి దిగడంతో గ్రామ కమిటీ ఎన్నికల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రామసముద్రం మండలంలోని అరికెల, మానేవారిపల్లె, మాలేనత్తం, కేసీపల్లె, మూగవాడి, చొక్కాండ్లపల్లె, మినికి, రాగిమాకులపల్లె, ఊలపాడు పంచాయతీలకు సంబంధించి శనివారం పరిశీలకుడు శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. మొదట అరికెల పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి నలుగురు పోటీ పడ్డారు. అయితే, హనుమంతురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పరిశీలకుడు శ్రీనివాసులునాయుడు ప్రకటించారు. భోజనం అనంతరం మూగవాడి పంచాయతీ ఎన్నిక జరగాల్సి ఉండగా, తమకు తెలియకుండా ఓ వర్గానికి చెందిన వ్యక్తిని గ్రామ కమిటీ అధ్యక్షుడుగా ఎంపిక చేస్తూ పరిశీలకుడు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని మరో వర్గానికి చెందిన శ్రీనివాసులు నిలదీశారు. దీనితో ఆ నిర్ణయాన్ని విరమించుకుని ఆశావహుల పేర్లను నమోదు చేసుకున్నారు. మినికి పంచాయతీలో కూడా టీడీపీ నేతలు పోటీ పడ్డారు. రాగిమాకులపల్లెకు సుబ్రహ్మణ్యం, ఊలపాడుకు వెంకటాచలపతి, చొక్కాండ్లపల్లె రెడ్డెప్పరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా గ్రామ కమిటీ అధ్యక్షుల ఎంపిక ఎన్నికలలో మండల టీడీపీ నాయకుల మధ్య ఉన్న వర్గపోరు మరోమారు బయటపడింది. కార్యకర్తలు, అభిమానులు విభేదాలు వీడి పార్టీకి అంకిత భావంతో పనిచేస్తుంటే కొందరు నాయకులు పార్టీని తమ స్వలాభం కోసం వాడుకుంటున్నారని, ఇది ఇలాగే కొనసాగితే రాబోయే స్థానిక ఎన్నికలలో పార్టీ తీవ్రంగా నష్టపోతుందని, ఇప్పటికైనా పరిశీలకులు మండల పరిస్థితిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి వర్గపోరుకు బ్రేకులు వేయాలని టీడీపీ కార్యకర్తలు, అభిమానులు కోరుకుంటున్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పది మందికి గాయాలు



కురబలకోట: సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



సంబేపల్లె: కాలు విరగడంతో కూర్చుండిపోయిన ఆటో డ్రైవర్ జాన్

కురబలకోట, జూలై 5(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పది మంది గాయపడగా వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది వివరాలిలా.. పెద్దమండ్యం మండలం ముసలికుంటకు చెందిన రైతులు బొలెరో వాహనంలో అంగళ్లు గొర్రెల సంతనుంచి స్వగ్రామానికి వస్తూ కురబలకోట రైల్వేగేటు సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. దీంతో వాహనం బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న పెద్దమండ్యం మండలం ముసలికుంట పంచాయతీ దట్టేనాయక్ తాండాకు చెందిన కృష్ణానాయక్(60), ఆయన కుమారుడు బాలాజీ నాయక్(30), బండ్రేవుకు చెందిన లక్ష్మయ్య(50), ముసలికుంటకు చెందిన మల్‌రెడ్డి (45), రామాంజనేయరెడ్డి (28), ద్విచక్రవాహనదారుడు గాలివీడు మండలం బలిజపల్లెకు చెందిన మహేష్(32) గాయపడ్డారు. మహేష్ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలాజీనాయక్, కృష్ణానాయక్, మహేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి ర్యాప్తు చేస్తున్నారు.

సంబేపల్లె : ఆటోను కారు ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. శెట్టిపల్లె గ్రామం నదిపిరివాండ్లపల్లెకు చెందిన జయనారాయణరెడ్డి హరిజనవాడకు చెందిన రమేశ్ అతని భార్య అలివేలు, కోడలు రెడ్డెమ్మతో కలిసి కారులో రాయచోటికి వస్తుండగా పీఎన్‌కాలనీ సమీపంలో డ్రిప్, ఎరువుల లోడ్‌తో వెళుతున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో అలివేలమ్మ, ఆటో డ్రైవర్ జాన్‌కు కాలు విరిగింది. రెడ్డెమ్మ, జయనారాయణరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలియజేశారు.

## వినాయకుడి విగ్రహం అపహరణ కేసులో 13 మంది అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి

పెనగలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వినాయకుడి విగ్రహం అపహరణ కేసులో 13 మందిని అరెస్టు చేసినట్లు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ తెలిపారు. శనివారం పెనగలూరు పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 24 తెల్లవారుజామున అత్తిగారిపల్లె బీసీ కాలనీ సమీపంలోని వినాయకుడి రాతి విగ్రహం అపహరణకు గురైంది. ఈ విషయంలో దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ముద్రపల్లె క్రాస్‌రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న 13 మందిని అరెస్ట్ చేసి, విచారణ చేయగా, వారంతా వినాయకుని విగ్రహం అపహరణ కేసులో నిందితులుగా తేలింది. వారంతా పికొత్తపల్లె, ఈటమాపురం, మనుబోలు, చింతకాయలపల్లి, కొందరు తమిళులుగా గుర్తించారు. ఈ 13 మంది ముఠాగా ఏర్పడి విగ్రహాన్ని ఓదేటివారిపల్లె క్రాస్‌రోడ్డు వరకు ఈడ్చుకుని పోయి, అక్కడి నుంచి ట్రాక్టర్లో ఈటమాపురం చెరువులోనికి తీసుకెళ్లారు. అక్కడ విగ్రహాన్ని పగులగొట్టి చూడగా, అందులో ఎలాంటి విలువైన వస్తువులు లభించలేదని తేలింది. ఈ కేసులో ముగ్గురు మహిళలతో పాటు పది మంది పురుషులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసు ఛేదించిన పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాయుడు, రవిశంకర్‌ను ఆయన అభినందించారు. సాంకేతికపరంగా వీరికి సహకరించిన స్టేషన్ సిబ్బందిని అభినందిస్తూ, రివార్డుల కోసం ఎస్పీకి సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులు పగులగొట్టిన విగ్రహం రాతి ముక్కలు, ఒక ఇన్నోవా కారు నాలుగు మోటార్‌బైకులు ఒక ట్రాక్టర్, సమ్మెట, క్షుద్ర పూజలు కోసం ఉపయోగించిన నిమ్మకాయలు, పసుపు, కుంకుమలను సీజ్ చేసినట్లు వివరించారు

## గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి విక్రేతతో సిద్దవటం పోలీసులు

సిద్దవటం, జూలై5 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శనివారం సిద్దవటం పోలీసులు అరెస్టు చేశారు. ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపిన వివరాల మేరకు.. కడప నగరానికి చెందిన రెడ్డి నరేశ్ అనే వ్యక్తి మండలంలోని భాకరాపేటలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడు లు నిర్వహించి, నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 1200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. వైజాగ్ జిల్లా చింతపల్లి గ్రామం నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి కడప నగరంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు మరి కొంతమందిని విచారణ చేయాల్సి ఉందన్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.20 వేలు ఉంటుందని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని సిద్దవటం జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్‌రఫీ, హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య, రైటర్ రాముడు, కానిస్టేబుల్ రాఘవ పాల్గొన్నారు.

## ముగ్గురిపై దాడి కేసు నమోదు

కలకడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళ్లపల్లె పంచాయతీ బొజ్జగుంటపల్లె వడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులపై దాడి చేసిన ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ హరిబాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు శ్రీనివాసులు అదే గ్రామంలోని రామాలయం వద్ద కూర్చుని సెల్‌ఫోన్ చూస్తుండగా అక్కడికి వచ్చిన రెడ్డిప్రసాద్, భార్య సౌజన్య, మరదలు సురేఖ తమను ఫోటో తీశాడంటూ శ్రీనివాసులు, అతని కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు హెచ్‌సీ తెలిపారు.

## కుక్కల దాడిలో జింకకు గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన జింక

తంబళ్లపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడికి గురైన జింకను ఓ వ్యక్తి కాపాడాడు. తంబళ్లపల్లె మండలం గోపిదిన్నెకు చెందిన మల్లికార్జునరెడ్డి శుక్రవారం రాత్రి తోటలో పనులు చూసుకుని ఇంటికి వెళ్తుండగా కుక్క లు జింకపై దాడి చేస్తుండడం కనిపించింది. దీంతో ఆయన కుక్కలను చెదరగొట్టి జింకను కాపాడి తన తోటలోని షెడ్డు వద్దకు చేర్చాడు. అటవీ సిబ్బంది, పశువైద్యులకు సమాచారం ఇచ్చాడు. శనివారం తెల్లవారుజామునే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామరాజు, పశు వైద్యురాలు ఇందు తోట వద్దకు చేరుకుని గాయపడిన జింకకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం అవసరమవ్వడంతో మదనపల్లె పశువైద్యశాలకు తరలించారు.

## యువకుడి ఆత్మహత్య



మస్తాన్ మృతదేహం

పీలేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): యమహా షోరూములో మెకానిక్‌గా పనిచేస్తున్న మస్తాన్(30) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మస్తాన్, శనివారం సాయంత్రం ఇంటిలోని తన గదిలో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. ఆ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిరారించారు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. పీలేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆక్రమిత ప్రభుత్వ స్థలం స్వాధీనం



అధికారులు కూల్చివేసిన అక్రమ కట్టడం

కురబలకోట,జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆక్ర మణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికా రులు స్వాధీనం చేసుకు న్నట్లు తహసీల్దార్ ధ నంజయులు తెలిపారు. మండలంలోని చింత మాకులపల్లె వాసి ఎస్. బాబురెడ్డి సర్వేనంబర్ 817లో గ్రామ చెరువులోని 15 సెంట్ల భూమి ని ఆక్రమించుకుని రేకుల షెడ్డును నిర్మించుకున్నాడు. దీనిపై అధికా రులు స్పందించి ఆక్రమ కట్టడాలను కూల్చి భూమి స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శేషాద్రి, పాల్గొన్నారు.

## రేపు నిత్యపూజేశ్వర హుండీ లెక్కింపు

సిద్దవటం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం జూలై 7న ఉదయం 10 గంటలకు నిత్యపూజేశ్వరస్వామి ఆలయంలో జరుగుతుందని ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పోలీసులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

కడప క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు కేజీల 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కడప చిన్నచౌకు ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం సూపరింటెండెంట్ రవికుమార్, ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐలు విశ్వనాధరెడ్డి, నీలకంఠేశ్వర్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లెకు చెందిన కడియాల పవన్‌కుమార్ బీటెక్ మధ్యలో వదిలేశాడు. అదే గ్రామానికి చెందిన మోటుపల్లి సతీష్‌చంద్ర డిగ్రీ రెండో సంవత్సరం చదువు సాగించారు. వీరు స్నేహితులుగా ఉంటూ చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు కడపలోని నందిమండలం గణేశ్, కడపకు చెందిన ప్రింటర్ చల్లా వినోద్, నారాయోగేషులు బద్వేలుకు చెందిన చిన్నన్నం నాగేంద్ర ద్వారా గంజాయి తెప్పించుకుని వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. శనివారం ఉదయం సమాచారం రావడంతో సీకేదిన్నె మండలం ఊటుకూరు వద్ద ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ విశ్వనాధరెడ్డి, ఎస్ఐ నరసింహారావు సిబ్బందితో కలిసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి కేజీ 25 గ్రాములు కలిగిన ఆరు ప్యాకెట్లు గంజాయి, బైకు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసకున్నట్లు తెలిపారు. అలాగే మరో కేసులో అప్సర సర్కిల్ వద్ద కడపకు చెందిన షేక్ గుడు సబ్‌వలి, కొత్తపేటకు చెందిన గోపిరెడ్డి మునీష్ కుమార్ రెడ్డి గంజయి విక్రయంచేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమా చారం రావడంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి సిబ్బందితో అరెస్టు చేసి, కేజీ 100 గ్రాములు కలిగిన గంజాయి , రెండు బైకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

# చస్తే.. చావే..!

- ఆరడుగుల జాగా కోసం ఆలంఖాన్‌పల్లె శ్మశానంలో అవస్థలు
- మురుగునీటితో చెరువులా శ్మశానం



శ్మశాన వాటికలోని కామ్రేడ్ల స్థూపాల వద్ద మురుగునీరు



ఆలంఖాన్‌పల్లె శ్మశాన వాటికలో మురుగు నీటిలో తేలుతున్నట్టు కనిపిస్తున్న సమాధులు

కడప మారుతీనగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): చనిపోయిన వారిని సమాధుల వద్దకు వెళ్లి నివాళి అర్పించి స్మరించుకునే సంప్రదాయం అన్ని మతాల్లోనూ ఉంది. హిందువులు ఉగాది, సంక్రాంతి పండుగల సమయంలో తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి టెంకాయలు కొట్టి వారిని స్మరించుకుని వస్తుంటారు. అయితే.. ఆలంఖాన్‌పల్లె వాసులకు మాత్రం ఇది సాధ్యం కావడం లేదు. ఎందుకంటే ఇక్కడి శ్మశానం దశాబ్దాలుగా మురుగునీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది.

కడప నగరంలోని 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో ఐదువేలకు పైగా జనాభా ఉన్నారు. అయితే వీరికి సరైన శ్మశాన వాటిక లేదు. ఉన్న శ్మశానంలో మురుగునీరు నిల్వ ఉంది. మామూలు రోజుల్లోనే ఆ శ్మశానంలో శవాన్ని పూడ్చాలంటే అగ్నిపరీక్షే. అలాంటిది వర్షాకాలంలో మరీ నరకయాతన తప్పదు. పాలకులు, అధికారులు మారుతున్నారే గానీ ఆలంఖాన్‌పల్లె శ్మశానవాటిక దుస్థితిలో ఎలాంటి మార్పురాలేదు. కాలం గడిచే కొద్దీ ఆ శ్మశానంలో శవాన్ని పూడ్చలేని దశకు చేరుకుంది. ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ నాయకులు శ్మశానం అభివృద్ధి చేయిస్తామని చెబుతున్నారే కానీ తర్వాత పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులకు, కార్పొరేషన్ కమిషనర్‌కు శ్మశానవాటిక దుస్థితిపై పలుమార్లు తెలిపినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్.మాధవి అయినా ఆలంఖాన్ పల్లె శ్మశానాన్ని పట్టించుకోవాలని వారు కోరుతున్నారు.

## హత్య కేసులో నిందితుడు అరెస్టు



హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఎర్రగుంట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఈ నెల 1వ తేదీ జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన షేక్షావల్లికి హసీనా అనే చెల్లెలు ఉంది. ఆమెకు భర్త చనిపోయి 15 సంవత్సరాలు అయ్యింది. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరు ఆర్ట్స్ కాలేజి రోడ్డు గురువయ్య తోటకు చెందిన షేక్ జాఫర్ వల్లితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. జూన్ 27వ తేదీ హసీనాను కడపలోని ఆమె తల్లివద్ద జాఫర్ వదిలి వెళ్లాడు. 30వ తేదీ హసీనాను పిల్చుకుని వెళ్లేందుకు అక్కడికి వెళ్లగా ఆమె అన్న షేక్షావల్లి చూసి తన చెల్లెలి జోలికి ఇకపై రావద్దని మందలించాడు. దీంతో తనకు హసీనాకు మధ్యలో అడ్డుగా ఉన్న షేక్షావల్లిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నాడు. జూలై 1న కడపకు వెళ్లి షేక్షావల్లిని మద్యం తాగుదామని పిలిచాడు. ఇందుకు ఆయన అంగీకరించడంతో ఎర్రగుంట్లకు వెళ్లి కుక్కలు పడదామని.. ఆ వచ్చిన డబ్బుతో మద్యం తాపుతానని ఆయన నమ్మించాడు. అతని మాటలు నమ్మి జాఫర్ వెంట ఎర్రగుంట్లకు వచ్చాడు. అదే రోజు సాయంత్రం మద్యం తాగేందుకు ఎర్రగుంట్ల మార్కెట్ యార్డుకు వెళ్లారు. ఎలాగైనా షేక్షావల్లిని చంపాలనుకున్న జాఫర్ గోదాం వెనుకకు తీసుకెళ్లి అతిగా మద్యం తాపించాడు. మద్యం మత్తులో ఉన్న షేక్షావల్లిని బండరాయితో తలపై కొట్టి చంపాడు. అనంతరం జాఫర్ అక్కడి నుంచి పరరాయ్యాడు. షెక్షావల్లి తమ్ముడు సయ్యద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎర్రగుంట్ల పోలీసులు హత్య కేసు మిస్టరీని ఛేదించి నిందితుడు జాఫర్‌ను అరెస్టు చేశా రు. కార్యక్రమంలో సీఐ నరేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన బాలాజీ

కమలాపురం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కడప- తాడిపత్రి జాతీయ రహదారి టి.చదిపిరాళ్ల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమా దంలో జాన బాలాజీ (29) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థాని కులు, పోలీసుల సమాచారం మేరకు కమలాపురం పట్టణానికి చెందిన బాలాజీ భారతి సిమెంటు పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యా హ్నం డ్యూటీకి వెళ్లారు. మరుసటి రోజు శనివారం తెల్లవారు జామున డ్యూటీ ముగించుకుని ఇంటికి బయల్దేరారు. చదిపిరాళ్ల గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆల్విన్‌వాహనం స్కూటరును ఢీకొంది. దీంతో బాలాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని విగత జీవిగా పడి ఉన్న బాలాజీని చూసి కన్నీరు మున్నీరుగా విలపించా రు. మృతునికి భార్య శృతి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

## నూతన బోధన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

వేంపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సాంకేతిక విద్యలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఎప్పటికప్పుడు నూతన బోధనా పద్ధతులపై అవగాహన పెంచుకొని విద్యార్థులకు బోధించాలని జలంధర్ నిట్ మెకానికల్ హెచ్‌ఓడీ, ప్రొఫెసర్ శ్రీనివాస్ సూచించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో బోధనా సిబ్బందికి ఫలిత ఆధారిత విద్య అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ శుక్ర, శనివారాల్లో జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక విద్యలో ఓబీఈ ప్రాముఖ్యత, పాఠ్యాంశాల రూపకల్పన, మూల్యాంకనంపై అవగాహన కల్పించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, వర్క్‌షాప్ ప్రతినిధులు కోటేశ్వరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కృషి

జమ్మలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అగ్రికల్చరల్, హౌసింగ్, చేనేత, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ , మైనింగ్, ఇరిగేషన్ తదితర శాఖలకు సంబంధించిన అభివృద్ధితో పాటు బంగారు కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై చర్చించారు. విజన్ ప్లానింగ్‌లో భాగంగా 2029 నాటికి బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఇందుకు అధికారులు అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

## ఆప్కో చేనేత అమ్మకాలపై డిస్కౌంట్

కడప మారుతీనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం సందర్భంగా ఆప్కోవారు చేనేత వస్త్రాల అమ్మకాలపై 30 శాతం నుంచి 50శాతం డిస్కౌంటు ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి కోటేశ్వర్‌రావు వెల్లడించారు. ఆ మేరకు కడప నగర వన్‌టౌన్ సమీప క్లాక్ టవర్ పక్కనే గల ఆప్కో మెగా షోరూంలో, కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆప్కో విక్రయశాలలో, పులివెందులలోని జయమ్మ మున్సిపల్ కాంప్లెక్స్‌లో, రాయచోటి బస్టాండు వద్ద, కోడూరు, చిట్వేలి రోడ్డు, రాజంపేట పాతబస్టాండు వద్ద గల ఆప్కో షోరూంలలో ఈ డిస్కౌంటు సేల్స్ అవకాశం కలదన్నారు. ఇందులో అన్ని రకాల వస్త్రాలపై 30 శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 35 శాతం నుంచి 50 శాతం వరకు డిస్కౌంటు ఉందన్నారు. ముఖ్యంగా ఆప్కోలో మంగళగిరి, బందరు, రాజమండ్రి, ఉప్పాడ, వెంకటగిరి, మాధవరం, చీరాల, కాటన్, పట్టు చీరలు, డ్రెస్ మెటీరియల్స్, రెడీమేడ్ షర్ట్స్, దుప్పట్లు, దోవతులు, లుంగీలు, టవల్స్ తదితర అన్నిరకాలపై 30 శాతం డిస్కౌంటు కలదన్నారు. రానున్న సెలవు దినాల్లో కూడా ఆప్కో షోరూంలు తెరిచి ఉంటాయన్నారు.

## గర్భిణీ మృతిపై త్రీమెన్ కమిటీ విచారణ

బద్వేలు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గుండంరాజుపల్లె ఎస్టీ కాలనీకి చెందిన గర్భిణీ గత నెల 29న వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన వార్త కథనాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు నియమించిన త్రీమెన్ కమిటీ శనివారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విచారణ చేపట్టారు. ఈ కమిటీలోని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్రీయ బాలుర సురక్ష కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేశ్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లేశ్‌లు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు హెల్త్ ఆఫీసరు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్, ప్రైవేటు హాస్పిటల్ డాక్టర్లను విచారించారు. మరణానికి సంబంధించిన అన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో తొట్టిగారిపల్లె ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపంటెండెంట్, వైద్యాధికారులు, కమ్యూనిటీ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొలతల భూములకు వేలం

పెండ్లిమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వరస్వామి దేవస్థానం భూములకు ఈనెల 9న బుధవారం దేవస్థానంలో అధికా రుల సమక్షంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ గంగనపల్లె, తిప్పిరెడ్డిపల్లె, కొత్తగిరియంపల్లె రెవెన్యూ గ్రామాల పరధిలో 23 ఎకరాలకు బహిరంగ వేలంలో హెచ్చు పాటదారునికి మూడేళ్ల కాలానికి కౌలుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. పాటదారుడు ప్రతి సంవత్సరం మార్చి నెలాఖరు లోపు మునుగుత్త చెల్లించి భూమిలోకి దిగాలన్నారు.

## ఆరుగురికి తిరుపతి స్విమ్స్‌లో వైద్యపరీక్షలు

పులివెందుల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జెండాలు తొలగించిన సమయంలో నమోదైన కేసులో ఉన్న ఆరుగురికి మరోసారి తిరుపతి స్విమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహించారు. శనివారం ఈ వైద్యపరీక్షల కోసం సీఐ చాంద్‌బాష ఆధ్వర్యంలో ఆరుగురిని పార్నపల్లె కిషోర్, సాతుపాటి రాజేష్, కావేటి మల్లికార్జున, షేక్ మస్తాన్, పార్నపల్లె వెంకటచలపతి, సాతుపాటి వెంకటపతిలను తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. మే నెలలో జరిగిన టీడీపీ మహానాడు సందర్భంగా పులివెందులలో కట్టిన జెండాలను తొలగించి అడ్డపడిన వ్యక్తిని మారణాయుధాలతో చంపేందుకు ప్రయత్నించారని హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ సమయంలో పోలీసులు మమ్మల్ని కొట్టారని ఈ కేసులో ఉన్న ఆరుగురు కోర్టుకు విన్నవించుకున్నారు. దీంతో మొదట జమ్మలమడుగు కోర్టు పులివెందుల ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించాలని ఆదేశాలు జారీ చేసింది. అక్కడ సరిగా చేయలేదని హైకోర్టును ఆశ్రయించడంతో జూన్ 18 కర్నూలు వైద్యశాలలో పరీక్షలు నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడవారికి 20న వైద్య పరీక్షలు నిర్వహించినా సరిగా చేయలేదని మరోమారు హైకోర్టును ఆశయించడంతో తిరుపతి స్విమ్స్‌లో నిర్వహించాలని జూన్ 30 తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. వారం రోజుల లోపు వైద్యపరీక్షలు నిర్వహించి సంబంధించిన రిపోర్టును కోర్టుకు సమర్పించాలని కోరింది. దీంతో అర్బన్ సీఐ చాంద్‌బాష శనివారం తిరుపతి స్విమ్‌లో వైద్యపరీక్షలకు తీసుకెళ్లారు.

## వాతావరణానికి అనువైన పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి

సీకేదిన్నె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతులు వాతావరణానికి అనువైన పంటలు సాగు చేసే విధంగా అవగాహన కలిగించాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శనివారం కడప, అన్నమయ్య జిల్లాల్లోని వ్యవసాయ ఉప సంచాలకులకు శిక్షణ, సందర్శన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వర్షాభావ పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయడం మంచిదన్నారు. జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ వ్యవసాయాధికారులు తగిన సలహాలు, సూచనలు అందించి... రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసి నష్టపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త వీరయ్య, శాస్త్రవేత్తలు మాధురి, శ్రీవల్లి, భాగవతప్రియ, ఆత్మా పీడీ విజయలక్ష్మి, రెండు జిల్లాల ఏడీఏలు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

దువ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబాకరాపురం గ్రామానికి చెందిన సుచరిత (19) అనే యువతి శుక్రవారం రాత్రి నుంచి కనిపించడం లేదు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ఈమె ఇంటి వద్ద ఖాళీగా ఉండేది. ఉన్నఫలంగా కనిపించకపోవడంతో తండ్రి జొన్నవరం ఓబులేసు శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

## ఇసుక లారీల పట్టివేత


జమ్మలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు వద్ద పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. పట్టుబడిన ఇసుక లారీలను ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఉంచామన్నారు. కాగా, జమ్మలమడుగు నుంచి అన్ని ప్రాంతాలవైపు ఇసుక తరలిపోతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి.

## 'జగన్ పట్టించుకోడు...కూటమికి పట్టదు'



రోడ్డు పనులు పెండింగ్‌లో ఉంచడంపై నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

వేంపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో నిలిచిపోయిన రోడ్డు పనుల గురించి పులివెందుల ఎమ్మెల్యే జగన్ పట్టించుకోడు... కూటమికి ఏమాత్రం పట్టడం లేదని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి మండిపడ్డారు. వేంపల్లెలో కోట్లాది రూపాయలతో గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనులు నిలిపివేశారు. ఇప్పటి వరకు పునఃప్రారంభంకాలేదు. శనివారం పట్టణంలోని ఆయా రోడ్లను పరిశీలించిన తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నిరసనగా టెంకాయమొక్క నాటారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లుతెరిచి రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, మండలశాఖ అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


**Wanted Recovery Agents**

Shahi Services Recovery Agency నందు కడపజిల్లాలో (నేషనల్ & ప్రైవేట్ బ్యాంక్స్) రికవరి చేయుటకు (Male /Female) ఏజెంట్స్ కావలెను. జీతం : 10000+ఇన్సెంటివ్స్ 1 Person Tele Callers, System Work in Office, Cell : 91826 14329, 93987 10799
Ajc-245163

**UTI MUTUAL FUND**

Dear Sir/Madam, డిపాజిట్‌లో డబ్బు ఉన్నదా! చాలా సంవత్సరములకు రెట్టింపు అవుతున్నదని బాధపడుతున్నారా! అయితే UTI Mutual Fund నందు ఉన్న పథకాలలో రూ.10,00,000లు పెట్టుబడి పెట్టి సం॥4, సం॥5, సం॥6లలో రూ. 23,00,000లు అంతకన్న ఎక్కువ అయ్యే పథకాల గురించి తెలుసుకుందాం రండి. పథకాల ROM OD కొరకు పాన్, ఆధార్, ఫోటో, చెక్, నామిని ప్రూఫ్‌తో సంప్రదించండి AVS Chandra Reddy, M.Sc., M.Ed., AMFI, MFD, 21-10, Gunta Bazaar, Near Tirumala Hospital, LED ప్రక్కన, R.S.Road, కడప – 516001.
Ajc-233380

**బంగారం కొనబడును**

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిజిస్టర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237899

**ముస్లీం వివాహ సంబంధాలు**

బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ ముస్లీం మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్: 87908 44959 (2వ సంబంధాలు కలవు)
AJL-236636

**CHANGE OF NAME**

Uruturu Dasetty Venkata Siva Reddaiah S/o Late Ramanna, Rank Naik, Army No. 1269139H, D.No. 3-3-186, Vempalle Road, Yerraguntla (V,P, M), Kadapa (Dist.) 516309, Andhra Pradesh. Army Record my wife name mention as Munilakshmi Devamma intead of Uruturu Dasetty Muni Lakshmi Devamma. vide Affidavit dated 03-07-2025. Before the Notary Public (Govt. of A.P.)
AJC-245037

**CHANGE OF NAME**

I,BATHALA VENKATA PADMA (Old Name) D/o Bathala Venkata Ramana,R/o 2/1053,Sri Hari Rao Street,Nagarajupeta,Kadapa,YSR Dist.,A.P. has been changed my name as "PATAN SHAHIDA" (New Name) D/o Bathala Venkata Ramana.
AJC-000

**CHANGE OF NAME**

I, KUMBHAGIRI SRI LENCY (Old name), residing at D.No: 9/66-Q, SIVARAM PURAM, PATUR POST, NANDALUR MANDAL, ANNAMAYYA DISTRICT, A.P., hereby changed my name as KUMBHAGIRI ANVITHA (New name), D/o KUMBHAGIRI MADHAVI and KUMBHAGIRI MANIKANTA GOPI
AJC-000

**CHANGE OF NAME**

SHEK ALI (old name) S/o. SHAIK HUSSAIN BASHA, R/o. D.NO.2-7-201, JANDAMANU STREET, PULIVENDULA, Y.S.R KADAPA DISTRICT, ANDHRA PRADESH, INDIA - 516390. Do hereby change my name to SHAIK GUGUDU VALLI (New Name), Hence forth then now I may be called as SHAIK GUGUDU VALLI.
AJC-000

**యూనిట్ కార్యాలయం**
9985411183
9985411189


## వెనకంజలో కర్నూలు, ఆధిక్యంలో నెల్లూరు జట్టు



వీరారెడ్డి (అనంతపురం) మహిత్ (కర్నూలు) భార్గవ మహేశ్ (నెల్లూరు)

కడప స్పోర్ట్స్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 19 మెన్స్ మల్టీ డే (మూడురోజులు) క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా రెండో రోజు శనివారం కర్నూలు జట్టు 158 పరుగుల వెనకంజలో ఎదురీదుతోంది. అలాగే మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు చిత్తూరుపై 83 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వివరాలిలా...

కేవోఆర్ఎం మైదానంలో కర్నూలు - అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో ఓవర్ నైట్ స్కోరు 135 పరుగులతో బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు 82.2 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 486 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో వీరారెడ్డి 251 పరుగులు, జయంత్‌క్రిష్ 79, సందీప్‌రెడ్డి 55 పరుగులు చేయడంతో జట్టు భా రీ స్కోరు చేసింది. బౌలింగ్ విభాగంలో మహిత్ 5 వికెట్లు పడగొ ట్టాడు. దీంతో అనంత పురం జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 273 పరుగులు ఆధిక్యత లభిం చింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరు గులు చేసింది. ఇందులో విష్ణువర్ధన్‌నాయుడు 69 పరుగులు చేశారు. దీంతో కర్నూలు జట్టు మరో 158 పరుగుల లోటుతో ఎదురీదుతోంది.

ఏసీఏ మైదానంలో నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 77.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం రెండో రోజు శనివారం 14 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 61.1 ఓవర్లలో 318 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సిద్దు 74 పరుగలు, వరుణ్ 64 పరుగులు, సాయిచరణ్ 60 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో భార్గవమహేశ్ 5 వికెట్లు సాధించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో 63 పరుగులు చేసి ఒక వికెట్ కోల్పోయింది. ఇందులో కారుణ్య ప్రసాద్ 47 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు.

## పెన్షనర్లకు షాక్.. వెనక్కి వెళ్లిన స్పౌజ్ పెన్షన్ల డబ్బు

ప్రొద్దుటూరు ,జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో జూలై నెలలో స్పౌజ్ కేసు కింద మంజూరైన 144 పెన్షన్ల డబ్బు వెనక్కి వెళ్లింది. దీంతో పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్న భర్త కోల్పోయిన వితంతువులు, భార్య కోల్పోయిన భర్తలు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు భర్త చనిపోతే అతనికి వచ్చే పెన్షన్‌ను వెంటనే భార్యకు అందజేసేలా అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోకుండా ఆటోమెటిక్‌గా భర్త డెత్ సర్టిఫికేట్ పెట్టగానే భార్యకు పించను డబ్బు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 144 మందికి స్పౌజ్ కింద పెన్షన్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి డబ్బు కూడా బ్యాంకులో జమ అయ్యింది. కానీ అనుకోకుండా జిల్లా డీఆర్‌డీఏ అధికారులు ఆ డబ్బును వెనక్కి పంపాలని ఆదేశించారు. కారణం తెలియకుండా మంజూరై వచ్చిన పించను ఈ నెల పొందుతామనుకునే లోపు తిరిగి వెనక్కి పోవడంపై పెన్షన్ దారులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే జరిగిన లోపాలను సరిదిద్ది మంజూరైన స్పౌజ్ పెన్షన్లు ఇచ్చేల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై కమిషనర్ రవిచంద్రారెడ్డిని వివరణ కోరగా డీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడి పెన్షన్ దారులకు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

## పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రీ అఫోర్స్ మెంట్ ఖాళీలలో బదిలీ కాబడిన,పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించి సత్వర మే జీతాలు చెల్లించాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్‌కు ఎస్‌టీఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నంద్యాల రాజగోపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీ, నేరాల కట్టడి

చెన్నూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల చోరీలు ఘర్షణలు, గొడవలు జరుగుతున్నాయని, వాటిని సకాలంలో గుర్తించి కట్టడి చేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి అని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. చెన్నూరు పోలీసుస్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించి అక్కడ రికార్డులను పరిశీలించారు. అలాగే సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల కాలంలో సీసీ కెమెరాల వల్లనే నేరాల కట్టడి జరుగుతుందని, వీటిని ప్రభుత్వ కార్యాలయాల వద్ద, వ్యాపార సంస్థల వద్ద గృహ యజమానులు తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రశాంతంగా ఉన్న చెన్నూరు మండలంలోప్రతిఒక్కరూ కలిసి మెలిసి జీవించాలని, చీటికి మాటికీ ఘర్షణలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలు అయిన ఇసుక అక్రమరవాణా, ఎర్రచందనం, మట్కా, జూదం, గంజాయిలాంటి విషయాలపై ఎవరు సమాచారం ఇచ్చినా తక్షణం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.50,116 విరాళం



చక్రాయపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రూ.50,116 విరాళంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ విశ్రాంత ఉద్యోగి వేమా వెంకటరమణ, సతీమణి నారాయణమ్మ అందించినట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వీరికి ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, సూపరింటెండెంట్ సుభాష్ పాల్గొన్నారు.

## క్రాప్ ఇన్సూరెన్స్ అవసరం లేనివారు బ్యాంక్‌ను సంప్రదించండి

సింహాద్రిపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా ప్రీమియం చెల్లించనవసరం లేని రైతులు వెంటనే సింహాద్రిపురం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్‌లో కలసి ఓటీటీ అవుట్ (ఇన్సూరెన్స్ వద్దు) పత్రం అందజేయాలని బ్యాంక్ మేనేజర్ కృష్ణ కిషోర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మేనేజర్ మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి జూలై 15వ తేదీ వరకు పంట రుణాలు రెన్యూవల్ చేసుకునే రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియం లోన్ అకౌంట్‌కు డెబిట్ చేయడం జరుగుతుంది. పంటల బీమా వర్తించినా, వర్తించక పోయిన వచ్చే ఏడాది రెన్యూవల్ సమయంలో వడ్డీతోపాటు, ప్రీమియం మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బీమా అవసరం లేదనుకునే రైతులు ఈ నెల 15వ తేదీ లోపు ఓటీపీ అవుట్ పత్రం అందజేయాలని మేనేజర్ తెలిపారు. పంటల బీమా ప్రీమియం ఎకరానికి వేరుశనగ - రూ.560, అరటి - రూ. 3025, పత్తి - రూ. 2వేలు, చీనీకి - రూ.2750లు లోన్ అకౌంట్‌కు జమ చేయడం జరుగుతుందని మేనేజర్ కృష్ణ కిషోర్ తెలిపారు.

## కేసీ ఆయకట్టు పరిధిలో పూర్తిగా రోడ్లనిర్మాణం



కొలతలు వేస్తున్న దృశ్యం

చెన్నూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీ ఆయకట్టు పరిధిలో రైతులకు అనుకూలంగా పూర్తిగా రాక పోకలకు అనువుగా రోడ్లనిర్మాణం చేపట్టడం జరుగుతోందని మండల కన్వీనరు కె.విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపవరం సమీపంలో కేసీ ప్రధాన కాల్వ ఆయకట్టు రోడ్డులో శనివారం కేసీ కెనాల్ ఏఈ గంగిరెడ్డితో కలిసి పరిశీలించారు. అలాగే సోమవారం నుంచే పనులు ప్రారంభిచేందుకు కేసీ కెనాల్ సిబ్బందితో కొలతలు వేయించారు.

## సర్వేయర్ల బదిలీల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు: కలెక్టర్

కడప కలెక్టరేట్, జూలై5,(ఆంధ్రజ్యోతి): సచివాలయ సర్వేయర్ల బదిలీల్లో అవకతవకలు జరిగాయని సామాజిక మాధ్యమాలలో వస్తున్న ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పందించారు. సచివాలయాల సర్వేయర్ల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగాలన్నారు. బదిలీల్లో ఎటువంటి అవకత వకలకు పాల్పడిన సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారంజిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను ఆదేశించారు.

## తరగతులు నిర్వహించకుండా పరీక్షలు ఎలా నిర్వహిస్తారు

కడప ఎడ్యుకేషన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఎడ్, లా కళాశాల విద్యార్థులకు తరగతులు నిర్వహించకుండానే పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ఆర్‌ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసుయాదవ్ ప్రశ్నించారు. శనివారం వైవీయూ పరిపాలన భవనం ఎదుట ఆర్‌ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నాళ్లీ.. ఎదురుచూపులు..!

## తారురోడ్డు కోసం గొందిపల్లె, తిమ్మారెడ్డిగారిపల్లె, బోడుగుండుపల్లె గ్రామస్థుల నిరీక్షణ



తిమ్మారెడ్డిగారిపల్లెకు ఈ కట్టపై వెళ్లాల్సిందే

చక్రాయపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల ప్రాంతమైన గొందిపల్లె,మండల కేంద్రంలోని తిమ్మారెడ్డిగారిపల్లెకు తారురోడ్డు నిర్మాణం కలగా మిగిలిపోయింది. ఎన్నో ఏళ్లుగా ఇదిగో తారురోడ్డు, అదిగో తారురోడ్డు అంటున్నారే తప్ప వచ్చిన పాపాన పోలేదు. గొందిపల్లెకు వెళ్లాలంటే దాదాపు చిలేకాంపల్లె గ్రామవాసులు ఐదారు కిలోమీటర్లు అడవి ప్రాంతంలో నడవాల్సి వస్తుంది. అలాంటి పల్లెకు తారురోడ్డు నిర్మాణం కావాలని ఎన్నో రోజులుగా నాయకులకు ఫిర్యాదు చేస్తున్నారు. అలాగే మండల కేంద్రం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోఉన్న తిమ్మారెడ్డిగారిపల్లె కూడా తారురోడ్డు నిర్మాణం ఇంత వరకు జరగకపోవడంతో ప్రజలునానా ఇబ్బందులు పడుతున్నారు. తిమ్మారెడ్డిగారిపల్లెకు వెళ్లాలంటే చెరువుకట్టమీద వెళ్లాల్సి ఉంది.ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది.అలాగే గొందిపల్లెకు వెళ్లాలన్నా, భూముల దగ్గరకు వెళ్లాలన్నా ప్రజలు చాలాప్రయాసలు పడుతున్నారు. రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. గొందిపల్లెకు ఒకవైపు అయినా రోడ్డు నిర్మాణం జరిగింది. మరోవైపు రోడ్డు లేక అక్కడి ప్రాంతం వాసుల భూములు బీళ్లుగా మారుతున్నాయి.వీటన్నిటితో పాటు గొంది ఓబులేసుస్వామి అక్కడ కొలువై ఉన్నారు. ఆ దేవాలయానికి వెళ్లాలన్నా రోడ్డు లేక ఇబ్బందిపడుతున్నారు. అంటే రోడ్డు తప్పకుండా వేయాల్సిందే. వీటన్నింటితో పాటు బోడిగుండుపల్లె కూడా తారురోడ్డు లేదని స్థానికులు వాపోతున్నారు. ఇలా ఎన్నో ఏళ్లుగా తారురోడ్డు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ కూటమి ప్రభుత్వం చేస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

### తారురోడ్డు కోసం ఎదురుచూస్తున్నాం..



మండల కేంద్రం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో తిమ్మారెడ్డిగారిపల్లె ఉంది. ఎన్నో ఏళ్లుగా వర్షాకాలం నడవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. తారు రోడ్డు వస్తుందని ఎదురు చూస్తున్నాం. అందులోను కట్టపై వాహనాలు వెళ్లాల్సి వస్తుంది. ఈ బురదకు వాహనాలు జారితే అంతే సంగతులే. ప్రమాదాలు జరగే ఆస్కారాలు ఉన్నాయి. అలాగే గొందిపల్లె మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో అడవిలో ఉంది. అడవిలో కూడా తారురోడ్డు నిర్మాణం జరిగితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

**గవినూర్ ఓబయ్య, తిమ్మారెడ్డిగారిపల్లె.**

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

కడప సెవెన్ రోడ్స్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్తం సార్వత్రిక సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, యూటీయూసీ జిల్లా నాయకులు సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కడప నగరంలోని స్థానిక సెవెన్ రోడ్స్ వద్ద ఉన్న ఆర్డీఓ ఆఫీస్ వద్ద నుంచి బైక్ ర్యాలీని ఎన్‌టీఆర్ సర్కిల్,కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, మహావీర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

## స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి

### డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, జూలై5,(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు,విద్యుత్ చార్జీల భారీ రద్దు చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలుఎన్.డి. విజయజ్యోతి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే రూ. 15,485 కోట్ల అదనపు చార్జీలను ప్రజలపై మోపడం ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేయడమే అని విమర్శించారు. కాగా వైఎస్ షర్మిల 7, 8వ తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని విజయజ్యోతి తెలిపారు

## కుట్టుశిక్షణ కేంద్రాల పరిశీలన

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలను బీసీ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టరు ఎ.మల్లికార్జున శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని అక్కాయపల్లె హౌసింగ్ బోర్డు కాలనీలోని కేంద్రాల్లో ఇస్తున్న శిక్షణను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.జయసింహ పాల్గొన్నారు.

**వసతిగృహాల తనిఖీ..:** జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాలను బీసీ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ మేనేజింగ్ డైరెక్టరు ఎ.మల్లికార్జున శనివారం తనిఖీ చేశారు. సరస్వతీపురం, పార్వతీపురంలోని వసతిగృహాలను సందర్శించిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు.

## పులివెందులలో ఎమ్మెల్సీ ప్రజాదర్బార్



పులివెందుల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆయన ఇంటి వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజాదర్బార్ కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గంలోని ప్రజలు వారి వ్యక్తిగత సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీచైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు,బాల కార్మిక వ్యవస్థ రూపుమాపాలి

కడప కలెక్టరేట్,జూలై5;(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను,బాల్యవివాహాలను రూపు మాపాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో బాలల రక్షణ, హక్కులపై విద్యాశాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు, ప్రైవేట్, ప్రభుత్వ హెచ్‌ఎంలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ, ప్రవేట్ కళాశాలల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో పెండింగులో ఉన్న ప్రమోషన్లను అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కడప మారుతీనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఆరు సంవత్సరాలుగా పెండింగులో ఉన్న ప్రమోషన్లను వెంటనే అమలు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట నాయకుడు నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని డిపోలు, గ్యారేజీల్లో శనివారం ఎర్రబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా కడప గ్యారేజీ వద్ద నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏఆర్ మూర్తి పలువురు పాల్గొన్నారు.

## రక్తదానం పట్ల యువత అవగాహన కలిగి ఉండాలి

కడప మారుతీనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రక్తదానం పట్ల యువత అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు యువతను కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో రక్తకొరత తగ్గించేందుకు వీలుగా ఈ నెల 20 నుంచి 26 వరకు రక్తవారోత్సవాలు జిల్లాలో చేపడుతున్నామన్నారు. రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా తీసుకుని ఈసేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అరవింద్, సుబ్బయ్య, అశోక్, నవీన్, సునీల్, దుర్గ, గణేశ్ పాల్గొన్నారు.

## విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు



'తొలి అడుగు'లో పేర్ల పార్థసారథిరెడ్డి

వేముల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి అన్నారు. శనివారం వేముల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగుకార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ల కరపత్రాలు పంపిణీ చేసి రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపట్టబోయే పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు చంటి, విశ్వేశ్వరరెడ్డి, శేషారెడ్డి, ఓబుళరెడ్డియాదవ్, శివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, బొగ్గల చెన్నారెడ్డి, మహేష్, సుధాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, ఎల్.రమణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏడాది పాలనపై ప్రజల్లో సంతృప్తి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏడాదిపాలనపై ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి తెలిపారు. శనివారం సుపరిపాలనకు తొలిఏడాదిలో భాగంగా కడపనగరం 7వ డివిజన్ విద్యుత్ నగర్‌లో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నక్కల శివరామ్, ప్రేమ్‌కుమార్, కొనిరెడ్డి, జానారెడ్డి పాల్గొన్నారు.

## సుపరిపాలనతోనే ముందడుగు

సీకేదిన్నె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సుపరిపాలనతో తొలి అడుగు వేస్తోందని బుగ్గలపల్లి పంచాయతీ ఇన్‌చార్జి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. బుగ్గపల్లె పంచాయతీలోని బుగ్గలపల్లి, బుగ్గలేటిపల్లె గ్రామాల్లో శనివారం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వారికి వివరించారు. కార్యక్రమంలో ఏవీలక్ష్మీనారాయణయాదవ్, ఆది, జనార్దన్‌రెడ్డి, చలపతి, చంద్ర, శ్రీను, లక్ష్మినారాయణ, ఓబుళరెడ్డి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## 9 జతల గిత్తలు పంపిణీ



గిత్తలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు పాడి పశువు పోషణ కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రైతులకు 9 జతల గిత్తలు టీడీపీ రాష్ట్ర రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఏపీఎల్‌డీఏ పథకం కింద మంజూరైన 9 జతల గిత్తలను వారు రైతులకు పంపిణీ చేశారు. వీటితో పాటు గొర్రెలు, పొట్టేళ్లు, మేకపోతులు, కోళ్లు, పందులు తదితర పోషణకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ రాఘవరెడ్డి, వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, జంపాల నరసింహారెడ్డి, దాదిరామయ్య, దివాకర్‌రెడ్డి, బోయిల శంకర్‌రెడ్డి, యల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి



విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

కడప సెవెన్ రోడ్స్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని శనివారం స్థానిక విద్యుత్ భవన్ వద్ద జరిగిన ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. అంతేకాకుండా గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, శంకర్‌నాయక్, మునయ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**కమలాపురం రూరల్..:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపిందని, అంతేకాక గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని సీపీఐ జిల్లాకార్యవర్గసభ్యుడు పి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక కమలాపురం అడ్డరోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్‌లో ఏఈ చాంద్‌బాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ కమలాపురం మండల కార్యదర్శి వర ప్రసాద్, కొండాయపల్లె శాఖ కార్యదర్శి సుమన్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన పీర్లు

కమలాపురం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయాపీర్ల చావిడిల వద్ద మొహర్రం పండుగ సందర్భంగా నిర్వాహకులు ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పీర్లను కొలువుదీర్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రజలు, భక్తులు కుల మతాలకతీతంగా పీర్లస్వాములకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. కమలాపురం, గోపులాపురం, చిన్నచెప్పలి, పెద్దచెప్పలి, గంగవరం, విభరాపురంలలో పీర్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పెద్దచెప్పలి వద్ద గల పీర్లచావిడి వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ నెల 6న మొహర్రం సందర్భంగా పదో రోజు పట్టణంలోని అన్ని పీర్లచావిడిలలో కొలువుతీరిన పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

**వల్లూరు..:** హిందూ ముస్లింలు నిర్వహించుకునే పండుగల్లో భాగంగా మొహర్రం (పీర్ల) ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ పెద్ద ఓబన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దపుత్త, గంగాయపల్లెలో నిర్వహిస్తున్న పీర్ల పండుగను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మొహర్రం వేడుకలను కలిసికట్టుగా జరుపుకోవాలని అందరూ ఐకమత్యంతో పండగ నిర్వహించుకోవాలన్నారు.





కమలాపురం, వల్లూరులో కొలువైన పీర్లు

# కబ్జాకు రంగం సిద్ధం..!

## ఆట స్థలాన్ని కాపాడుకోకపోతే కనుమరుగే



చెన్నూరు కొత్తగాంధీనగర్‌లో ఆటస్థలంగా కేటాయించాలని కోరుతున్న పబ్లిక్ టాయిలెట్ ప్లేస్

చెన్నూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తగాంధీనగర్‌లో గతంలో పబ్లిక్ టాయ్‌లెట్‌గా ఉన్న స్థలాన్ని తదనంతరం కాలంలో ఓ ఆట స్థలంగా మార్చారని, ఇది అక్కడ స్కూలు పిల్లలకు ఉపయోగపడాల్సి ఉండగా కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వెంటనే ఆ స్థలం కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కొత్తగాంధీనగర్‌లో సర్వేనెం.58/పీలో పాఠశాల వెనుకవైపు గతంలో పబ్లిక్ టాయిలెట్ ఉండేది. ఈ స్థలం గతంలో మహిళలకు ఉపయోగడేది. ఆ తరువాత వాటిని తొలగించి వ్యక్తిగత మరుగుదొడ్లు ఇవ్వడంతో ఖాళీ పడ్డ ఆ స్థలాన్నింటిటీ చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాలు, ఆటస్థలాలుగా మార్చారు. అయితే వీటిపై కన్నేసిన కొందరు వ్యక్తులు వాటికి బోగస్ పొజిషన్ సర్టిఫికెట్లు సృష్టించి కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసిన స్థానికులు కబ్జాదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### అది ఆటస్థలంగానే కేటాయిస్తాం

మండల వ్యాప్తంగా కొన్ని ప్రాంతాలలో పబ్లిక్ టాయిలెట్ స్థలాలు నిరుపయోగంగా మారాయి. వాటిని పాఠశాల విద్యార్థులకు ఆటస్థలంగా కేటాయిస్తాం. ఒకవేళ ఆ స్థలం జోలికి ఎవరైనా వెళ్లినా చర్యలు తప్పవు. వాటన్నింటిపై పంచాయతీకి హక్కు ఉంటుంది.

●కిరణ్‌మోహన్‌రావు, ఎంపీడీవో, చెన్నూరు

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం
ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.
పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్
ప్రకటనలపై జి.యస్.టీ. 5% అదనం
యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411193, 9985411189.
ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411193 బద్వేలు : 9985921375 కోడూరు : 9985411193

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
D.C.M.: 99854 11184

## ఆశా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

దువ్వూరు/బి.కోడూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): దువ్వూరు సచివాలయం-1, 2 పరిధిలో ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దువ్వూరు వైద్యాధికారి సురేష్‌బాబు, బి.కోడూరు వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. దువ్వూరులోని రెండు సచివాలయాల పరిధిలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అలాగే బి.కోడూరు మండలంలోని బి.కోడూరు పంచాయతీకి 1, మేకవారిపల్లె 1, మున్నెల్లి 1 పోస్టు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి పాసై 25 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సుకలిగిన వివాహిత మహిళలు అర్హులని, ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## రేపు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పోరుమామిళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గమంతటా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 7వ తేదీన పండుగలా జరుపుకోవాలని ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యుడు ఈశ్వరయ్య మాదిగ, ఎంఈఎఫ్ నాయకుడు శోభన్ అన్నారు. శనివారం మాదిగ దండోరా జెండాల పంపిణీ కార్యక్రమాన్ని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గసభ్యుడు ఓబులాపురం శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉద్యమ జెండా ఎగురవేస్తూ మాదిగ ఉద్యమశక్తిని మరింత ముందుకు తీసుకురావాన్నారు. యువత ఉద్యమ స్ఫూర్తితో చైతన్యం కావాలన్నారు. కార్యక్రమంలో మనోసాగర్ పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ.30వేల విరాళం

ఖాజీపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెముళ్లపల్లె దళితవాడలోని సీతారామాలయ నిర్మాణానికి టీడీపీ నాయకులు రూ.30 వేల విరాళం అందజేశారు. ఈ మేరకు శనివారం గ్రామపెద్దలకు ములబాకు వాటర్‌షెడ్ కాంట్రాక్టర్లు నంద్యాల సుబ్బయ్య, శ్రీనివాసులు నగదును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రవి, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

## పంటలకు బీమా చేసుకోవాలి

ఖాజీపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు జూలై చివరికి బీమా చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో సాగు చేసిన పసుపు పంటకు రూ.180, పప్పు ధాన్యాలకు రూ.36, జొన్నకు రూ.38, మినుములకు రూ.38, ఉల్లికి రూ.90, వరికి రూ.84 ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రతి పంటను గ్రామాల వారీగా నమోదు చేసుకోవడం జరుగుతుందని, అందుకు రైతులు సహకరించాలన్నారు.

## మరమ్మతులకు ఆర్టీసీ బస్సులు

జమ్మలమడుగు, జూలై 5(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డిపోలో కాలం చెల్లిన, వివిధ సమస్యలతో ఉన్న బస్సులను అధికారుల ఆదేశాల మేరకు మరమ్మతులకు తరలిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శనివారం జమ్మలమడుగులో డిపో గ్యారేజీ నుంచి అద్దాలు, సీట్లు లేని హైటెక్ బస్సులను కడపకు తరలించారు. వాటి స్థానంలో ఆగస్టు 15 తేదీ నాటికి కొత్త బస్సులను తెప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నట్లు సిబ్బంది తెలిపారు.

## ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు

జమ్మలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పశువైద్యశాలలో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్య అధికారులు మాట్లాడుతూ అన్ని పశువైద్యశాలల్లో ఈ టీకాలు ఉచితంగా వేసే ఏర్పాట్లు చేశామని, అలాగే ఆదివారం కూడా స్థానిక పశువైద్యశాలల వద్ద ఈ టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబ సంక్షేమమే సీఎం లక్ష్యం

● 'సుపరిపాలనలో తొలి అడుగు'లో రితీష్‌రెడ్డి



కమ్మవారిపల్లెలో మహిళలతో మాట్లాడుతున్న రితీష్‌కుమార్‌రెడ్డి



ప్రొద్దుటూరు 40వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి తదితరులు

పోరుమామిళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ లక్ష్యమని బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పోరుమామిళ్ల మండలంలోని కమ్మవారిపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మవారిపల్లె టీడీపీకి కంచుకోటగా ఉన్నదని, ఈ గ్రామస్థుల రుణం తీర్చుకుంటామన్నారు. పోరుమామిళ్లతో పాటు రంగసముద్రం పంచాయతీ విస్తరించిందని, సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమకు ఇళ్లపట్టాలు మంజూరు చేయించాలని కోరగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బొజ్జ రోశన్న, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ మండల అధ్యక్షులు నగరి భైరవ ప్రసాద్, కొండా రామక్రిష్ణరెడ్డి, కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సుపరిపాలనకు జన నీరాజనం

బద్వేలుటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులకు ప్రజలు నీరాజనం పలుకుతున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని రామాంజనేయనగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి విచారించారు. కూటమి ప్రభుత్వంతోనే పేదల అభ్యున్నతి సాధ్యమన్నారు. కార్యక్రమంలో బొజ్జా రోశన్న, వెంగల్‌రెడ్డి, బిగ్‌బాస్, విజయ్‌కుమార్, వెంకటసుబ్బయ్య, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

### ఏడాదిలోనే ఎన్నికల హామీల అమలు

ప్రొద్దుటూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిందని మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి అన్నారు. శనివారం స్థానిక 40 వార్డు సూపర్ బజార్ నాలుగు రోడ్ల కూడలి నుండి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో మోసపోయిన ప్రజలు కూటమి ఏడాది పాలనపై నమ్మకాన్ని విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌లు వెంకటకొండయ్య, జబివుల్లా, సర్పంచ్ శివచంద్రారెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, బచ్చల ప్రతాప్, మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### కూటమి పాలనపై విమర్శలు తగదు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి అన్నారు. శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పంచాయతీల నిధులను పక్కదారి పట్టిస్తే ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పల్లె పండుగ పేరుతో రూ.4,500 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. మద్యపాన నిషేధం, జాబ్‌క్యాలెండర్ అంటూ వైసీపీ ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రొద్దుటూరులో మట్కా, క్రికెట్ బెట్టింగ్ మీ కనుసన్నల్లోనే జరిగిందన్న విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో జనసేన వీరమహిళ సంధ్య, సంజీవ్, హరీష్, నాగరాజు, బాలపెద్దన్న పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం

ప్రొద్దుటూరు అర్బన్ జూలై 5(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి ఒక మంచి అవకాశం అని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, రెండవ అదనపు జిల్లా జడ్జి సత్యకుమారి తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి 46 క్రిమినల్, 114 సివిల్ కేసులను రూ.15,04,785 లకు సెటిల్మెంట్ చేయడం జరిగిందని తెలిపారు. న్యాయవాదులు, పోలీసుల సహకారంతో కార్యక్రమం జయప్రదం అయిందని తెలిపారు.

## బద్వేలులో 3652 కేసులు పరిష్కారం

బద్వేలు రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుని కక్షిదారులు ప్రశాంత జీవనం కొనసాగించాలని సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి వై.సవిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.ముఖేష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో ఏర్పాటు చేసిన లోక్‌అదాలత్‌లో రెండు బెంచ్‌ల ద్వారా క్రిమినల్ కేసులు 450, సివిల్ కేసులు 21, ఎస్‌టీసీ కేసులు 3181 మొత్తం 3652 కేసులకు గాను రూ.95,751లకు పరిష్కారం జరిగినట్లు తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కొండాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. మండల కేంద్రమైన కొండాపురం గ్రామంలోని వడ్డెర కాలనీని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఇంటి చెత్తను ఎక్కడంటే అక్కడ ఇష్టం వచ్చినట్లు వేయవద్దని, చెత్త వాహనంలో మాత్రమే వేయాలని ఇంటి యజమానులకు సూచించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరాపై కాలనీ వాసులతో చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ బొలిశెట్టిప్రసాద్ సూచించారు. శనివారం మండల పరిధిలోని గొరిగెనూరు గ్రామ సచివాలయంలో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రజలు, ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి సభ్యురాలితో బయోమెట్రిక్ వేయించాలి

పోరుమామిళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఎస్‌హెచ్‌సీ సభ్యురాలితో బయోమెట్రిక్ వేయించాలని ఏపీయం వీరాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తిభవనంలో వీవోఏల రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీలకు ఎంసీపీల ద్వారా మాత్రమే బ్యాంకు లింకేజీ లోన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీసీలు, ఈవోఏలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మొహర్రం

బ్రహ్మంగారిమఠం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలో మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. స్థానిక గుండాపురంలో శనివారం రాత్రి జెండా ఊరేగింపు, చదివింపులు, గుండం నిప్పు వెలిగించడం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పీర్లను ఊరేగించారు. ఈ కార్యక్రమాలు గుండాపురం గ్రామప్రజల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## మెరుగైన సేవలు అందించాలి : ఎంపీపీ

ప్రొద్దుటూరు రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు తమ పరిధుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్‌జీఎస్ నిధులను సీసీ రోడ్లకు ఉపయోగించడం వలన గ్రామాల్లో రోడ్లు అందుబాటులోకి వస్తాయని, అయితే డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఈ వర్షాకాలంలో మురుగుపారేందుకు దారిలేక అపరిశుభ్రత నెలకొంటున్నదన్నారు. ఎన్ఆర్‌జీఎస్ నిధుల్లో 60 శాతం రోడ్లకు, 40 శాతం డ్రైనేజీకి ఉపయోగించడం వలన గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు పరిశుభ్రత పాటించి దోమలను లార్వా దశలోనే నిర్మూలించే చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వివిధ శాఖల అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ నాన్ పీహెచ్ వర్కర్ల వేతనాలు పెంచాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేసే నాన్ పీహెచ్ వర్కర్లకు జీతాలు పెంచాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు మధు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నాన్ పీహెచ్ వర్కర్లు ఔట్ సోర్సింగ్ కింద చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారని, వీరికి రూ.26 వేల జీతం ఇవ్వాలని, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు గురుమూర్తి, వీరమ్మ, సహాయ కార్యదర్శులు జ్యోతి సురేష్, రాజేష్, సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ అపర్ణ అన్నారు. శనివారం దొరసానిపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆయుష్ ఆధ్వర్యంలో దోమకాటు వలన వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటు నుండి రక్షించుకోవడానికి దోమతెరలు ఉపయోగించాలని, దోమలు వ్యాపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో యునాని వైద్యుడు నిరంజన్‌నాయక్, అంకాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖలో వింత నిర్ణయాలు మానుకోవాలి

కలసపాడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో అమలు చేస్తున్న పలు వింత నిర్ణయాలు మానుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి తెలిపారు. శనివారం కలసపాడులో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులతో బోధన తప్ప ఎలాంటి కార్యక్రమాలు చేపట్టబోమని చెప్పిన ప్రభుత్వం మెగా పీటీఎం, శిక్షణల పేరుతో బోధనా కార్యక్రమాలకు ఆటంకం కలిగించడం సరికాదన్నారు. విద్యార్థులకు కాకుండా కేవలం టీచర్లు మాత్రమే ఐచ్ఛిక సెలవులు వాడుకోమనడం వింతగా ఉందన్నారు. డీఏ, మధ్యంతర భృతి, పీఆర్సీల విషయంలో తీవ్రజాప్యం చేయడం తగదన్నారు. వెంటనే 12వ పీఆర్సీ ప్రకటించి, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల విషయంలో ఇదే వైఖరిని అవలంబిస్తే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

## నోటు పుస్తకాల పంపిణీ

కాశినాయన జూలై 5(ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లకు చెందిన ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం 595 మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పిట్టిగుంట, ఆకులనారాయణపల్లె, మిద్దెల, ఉప్పలూరు, నర్సాపురం కొండ్రాజుపల్లె తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.




## కార్మికుల వేతనాలు పెంచాలి

బద్వేలు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం మున్సిపల ఇంజనీరింగ్ ఒప్పంద కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి నాగేష్ కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నరసింహారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అలాగే జీవో నెం. 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరాజు, నరసింహులు, నరసయ్య, ఆదినారాయణ, దేవా, వెంకటరమణ, హరి పాల్గొన్నారు.

## పోరాటమే ఆయుధం

పోరుమామిళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): అగ్రకులాల ఆధిపత్యంలో మగ్గిపోతున్న దళితులకు విముక్తి కలగాలంటే పోరాటమే ఆయుధం కావాలని దళిత గిరిజన జేఏసీ డివిజను అధ్యక్షుడు ముత్యాల ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, ఎంఈఎఫ్ నాయకులు ఈశ్వరయ్య, రమణ అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో దళిత గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం రిజర్వుడ్ అయి 25 సంవత్సరాలు అవుతున్నా నేటికీ గెలిచిన ఎమ్మెల్యేలు అగ్రవర్ణాల బూర్జువా పార్టీలకు అమ్ముడుబోయి బానిసలుగా మారిపోయారన్నారు. అగ్రవర్ణాల పెత్తనం పెరిగి దళితులపై వివక్ష చూపుతున్నారన్నారు. దళితులకు ఏ సమస్య వచ్చినా జేఏసీ ఆధ్వర్యంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బండి ఓబులేసు, జేఏసీ నాయకులు నారాయణ, ముత్యాల చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మురికినీటిలో నిలబడి నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు



## దళితుల పట్ల చిన్నచూపు తగదు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు ఆదర్శనగర్ దళిత కాలనీ పట్ల మున్సిపల్ అధికారులు చిన్నచూపు చూడడం తగదని దళిత సంఘాల నాయకులు అన్నారు. శనివారం ఆదర్శనగర్ కాలనీలో రోడ్డుపై మురికినీరు నిలబడడంతో మురికినీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎన్ రాజా మాట్లాడుతూ ఆదర్శనగర్ మున్సిపాలిటీకి శివారు ప్రాంతంలో ఉండడంతో అధికారులు ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదన్నారు. ఆదర్శనగర్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుందని, ఈ రోడ్డుపై నెలల తరబడి మురికినీరు నిలిచి ఉండడంతో దుర్వాసన, దోమలు, విషపురుగుల సంచరిస్తున్నాయని, దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో రెండుసార్లు మున్సిపల్ కమిషనర్ పర్యటించినా సమస్య పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. మురికినీరు ముందుకుపోయే మార్గంలేక రోడ్డుపైనే నిలిచిపోతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల రాజా, జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింహులు, నారాయణ, రవికుమార్, మత్తయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



విద్యుత్ ఏడీ గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

జమ్మలమడుగు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను రద్దు చేసి ప్రజలపై పడుతున్న విద్యుత్ భారాన్ని తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మూలె వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జమ్మలమడుగులోని విద్యుత్ ఏడీ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఏడీ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వలన విద్యుత్ వినియోగదారులపై అధిక భారం పడుతుందన్నారు. విద్యుత్ చార్జీల సర్దుబాటు పేరుతో ప్రభుత్వం రూ.కోట్ల ప్రజలపై భారం మోపిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేసి స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శులు రాంప్రసాద్, కృష్ణ, సహాయ కార్యదర్శి మునిరెడ్డి, వెంకటరమణ, మధు, రంగనాయకులు, సుబ్బన్న, గురుస్వామి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్, కండక్టర్ పోస్టులు భర్తీ చేయాలి



డిపో గేటు వద్ద ధర్నా చేపట్టిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

బద్వేలు రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఏర్పడ్డ డ్రైవర్, కండక్టర్ పోస్టులను భర్తీ చేసి డీడీ అమౌంట్లు పెంచాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బోసుబాబు డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పద్ధతిలో వైద్య సౌకర్యాలు కల్పించాలని, పెండింగులో ఉన్న డీఏ బకాయిలు చెల్లించాలని, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కిమ్స్ పేపర్లు, కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్తబస్సులు ఏర్పాటు చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి మహిళా జిల్లా సెక్రటరీ విజయమ్మ, రీజనల్ కమిటీ ఎన్వీకే రెడ్డి, డిపో సెక్రటరీ నరసింహులు, మణ్యం, పెంచలయ్య రసూల్, శ్రీను, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలి

● సీపీఐ డిమాండ్

బి.కోడూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు వీరశేఖర్ డిమాండు చేశారు. శనివారం మండల కేంద్రమైన బి.కోడూరు నాలుగురోడ్ల కూడలిలో సీపీఐ నాలుగవ మండల మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలో చూసినా శ్మశానాల సమస్య అధికంగా ఉందన్నారు. మున్నెల్లి గ్రామానికి ఇంటిపట్టాలు ఇవ్వడంలో ఉన్న సరదా ఆ భూములు ఎక్కడ ఉన్నాయో చూపించేందుకు రెవెన్యూ అధికారులు సహకరించడం లేదన్నారు. మండలంలో పదిసంవత్సరాలుగా ఒక్క అసైన్‌మెంటు కమిటీ కూడా జరగకపోవడం విచారకరమని, దీంతో దోచుకున్న వారికి దోచుకున్నంత రీతిలో మండలంలోని వందల ఎకరాలు కబ్జాకు గురి అయ్యాయన్నారు. వెంటనే వీటిపై అధికారులు చొరవ తీసుకుని పేదలకు ఇంటిపట్టా, బంజరు భూమి కేటాయించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యవర్గసభ్యులు పీవీ రమణ, రవికుమార్, వనమాల చెన్నయ్య, సునీల్‌కుమార్, ఎర్రబల్లె ప్రసాద్, శేఖర్, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



బికోడూరు నాలుగురోడ్ల కూడలిలో పార్టీ జెండా ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు




ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 | జమ్మలమడుగు - S.R.: 94404 72816 | మైదుకూరు - S.R.: 91334 42886 | బద్వేల్ - S.R.: 99666 83437 | D.C.M. : 99854 11184